క్లుప్తంగా

వైద్యపరీక్షల శిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 178 మందికి వైద్యపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేసినట్లు వైద్యాధికారి ఎస్తేరురాణి తెలిపారు. గర్భిణులు, బాలింతలకు షుగర్, బీపీ, థైరాయిడ్, ఎకో పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి



పట్నంబజారు: రహదారి భద్రత నిబంధనల్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. స్వర్ణభారతీనగర్‌లోని డీటీసీ కార్యాలయంలో గురువారం ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్సు కోసం వచ్చే వారికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా లఘు చిత్రాలు, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాలకు సంబంధించిన ఘటనలను స్క్రీన్ ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ఎడ్యుకేషన్ సెంటర్ ద్వారా రహదారి భద్రతపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మోటారు వాహన చట్టం, మౌలిక సూత్రాలు, ట్రాఫిక్ సూచనలు, నిబంధనలు అతిక్రమిస్తే వేసే జరిమానాలు, శిక్షల గురించి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కార్యాలయాల్లో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చిత్రలేఖనంతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును



గుంటూరు ఎడ్యుకేషన్: చిత్రలేఖనంపై పట్టు సాధించడం ద్వారా సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టవచ్చని మధుర్ ఆర్ట్ స్కూల్ మాస్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు. బ్రాడీపేట 4/19లో డ్రాయింగ్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్‌తో పాటు హ్యాండ్ క్రాఫ్ట్ తయారీలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. శిక్షణ పొందిన 70 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ నెలరోజుల శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. చిత్రలేఖనంతో పాటు పెయింటింగ్, హ్యాండ్ క్రాఫ్ట్, చేతిరాతలో నైపుణ్యాన్ని కల్పించడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, మేధస్సు అభివృద్ధి చెందుతాయన్నారు. తద్వారా విద్యలో రాణించగలరని ఆయన పేర్కొన్నారు.

కాలువల్లో వ్యర్థాలను తొలగించండి



తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన పంట కాల్వల్లో ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 37వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రధాన కాల్వను పరిశీలించారు. కాల్వలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

నగరం: మండలంలోని ఈదుపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాశన, శివ మండపారాధన, మహాన్యాస రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల కుమార్ శర్మ అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీ మల్లికార్జున స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల శేషగిరిరావు పాల్గొన్నారు.

సాగుకు 'యంత్ర' సాయం బాగు

- వ్యవసాయంలో పెరిగిన వినియోగం
- అన్ని పనులలో రైతులకు చేదోడు
- ఎండుగడ్డి కట్టలకూ అవే వాడకం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతులు

తాడేపల్లి రూరల్: ఇటీవల వరిసాగులో యంత్రాలకు ప్రాధాన్యత పెరిగింది. దాదాపు 95 శాతానికి పైగా పంటను యంత్రాలతోనే కోయిస్తున్నారు. భూమిని దమ్ము చేయడం దగ్గరి నుంచి నాట్లు వేయడం, పురుగు మందుల పిచికారీ, పంట నూర్పిడి వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు వరిచేనును యంత్రాలతో కోసి, పొలాల్లో వదిలేసిన గడ్డిని కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్ద మొత్తంలో సబ్సిడీపై యంత్రాలకు రుణాలు అందజేయడంతో గ్రామాల్లోని రైతులు కమిటీలుగా ఏర్పడి వివిధ యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు.

సులువైన పని....

వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల సాగు పనులు రైతులకు చాలా సులువుగా మారాయి. ముఖ్యంగా వరికోతల సమయంలో కూలీల కొరతతో గతంలో ఇబ్బందులు పడేవారు. కోత యంత్రాలు రావడంతో పని సులువైంది. ఖర్చు తగ్గింది. అయితే మెషిన్‌తో కోయగా వచ్చిన గడ్డి పశువులకు దాణాగా ఉపయోగపడదని రైతులు భావించే వారు. దాన్ని అలాగే చేలల్లో వదిలేసేవారు. కానీ అది కేవలం అపోహ అని, ఆ గడ్డిలోనూ పోషకాలు ఉంటాయని, పైగా చిన్న ముక్కలుగా తెగిన గడ్డి పశువులకు త్వరగా జీర్ణమవుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో రైతులు ప్రత్యేక యంత్రాల సాయంతో ఆ గడ్డిని కట్టలు కట్టించి, పశువులకు దాణాగా ఉపయోగిస్తున్నారు. యంత్రాలు అన్ని పనుల్లో రైతులకు చేదోడుగా మారాయి.



యంత్రాల సహాయంతో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

యంత్రాల వినియోగం....

మంగళగిరి నియోజకవర్గంలో ప్రధానంగా పంట మాసులుకు యంత్రాలను ఉపయోగించడం పరిపాటిగా మారింది. యంత్రంతో పంట మాసూళ్లు చేయడం వల్ల వరిగడ్డి ముక్కలుగా తెగిపోతుంది. ఈ గడ్డిని పశువులకు మేతగా వేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని భావించి చేలల్లోనే తగలబెట్టేవారు. దీంతో పశువులకు ఎండుగడ్డి కొరత ఏర్పడేది. కొన్ని సమయాల్లో ఇతర జిల్లాల నుండి గడ్డిని కొనుగోలు చేసేవారు. ఎకరం గడ్డి సుమారు రూ.8 వేల నుండి రూ. 10 వేలు పలికేది. దీంతో పశువుల పెంపకం చాలా కష్టంగా మారింది.

వృథా కాదు... పోషకాహారం

వరికోత యంత్రాలతో మాసూలు చేసిన గడ్డి కూడా పశువులకు ఉపయోగపడుతుందని రైతులకు పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ముక్కలైన గడ్డిని తినడం వల్ల పశువులకు త్వరగా జీర్ణం అవుతుందని తెలిపారు. దీంతో రైతులు యంత్రాల ద్వారా మాసూలు చేయగా వచ్చిన గడ్డిని పశువులకు మేతగా ఉపయోగించడాన్ని అలవాటు చేసుకున్నారు.

ఆ గడ్డినే వినియోగిస్తున్నాం



ఇప్పుడున్న తరంలో వ్యవసాయ పనులు చేయాలంటే తప్పని సరిగా యంత్రాల అవసరం ఎంతో ఉంది. దుక్కి దున్నే దగ్గర నుంచి సాలు, విత్తనాలు, అరటి బోదలు వేయడం, మందులు పిచికారీ వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నాం. వ్యవసాయ కూలీలతో చేసే పని యంత్రాలతో ఒక్కరోజులో అవుతోంది. ఒక్కోసారి కూలీలు కూడా దొరకడం లేదు. కలుపు తీసేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. చివరకు కలుపుతీసే యంత్రాలను కూడా వినియోగిస్తున్నాం.

వీరంకి హరిబాబు గౌడ్, ఇప్పటం

అవగాహన పెరిగింది...



గడ్డిని కట్టలుగా చుట్టే యంత్రాలు రాని సమయంలో ఎండుగడ్డి వృథా అయ్యేది. గడ్డిని బెయిలింగ్ చేసే యంత్రాలు రావడం చాలా ఉపయోగకరంగా ఉంది. పశువులకు గడ్డి కొరత తీరింది. చాలామంది రైతులు అవగాహన పెంచుకున్నారు. పశువులకు మేత కొరత లేకుండా చూసుకుంటున్నారు.

-నరేంద్ర కుమార్, తాడేపల్లి పశువైద్య శాల వైద్యులు

కాలుష్యానికి నిలయంగా ఆర్.అగ్రహారం కోనేరు



కలుషితమైన నీటితో కోనేరు

గుంటూరు ఈస్ట్: ఆర్.అగ్రహారం కోనేరు కాలుష్యానికి నిలయంగా మారింది. రెండు శతాబ్దాల కిందట చుట్టూ ఉన్న ఆలయాలతో పాటు స్థానికులకు మంచి నీరు అందుబాటులోకి తెచ్చేందుకు తవ్వించారు. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కోనేరు నుంచి చుట్టుపక్కల ప్రజలు , ఆలయ పూజారులు నిత్యం ఇందులో నుంచి నీటిని తీసుకు వెళ్లేవారు. కాలక్రమంలో కోనేరు పాడుబడింది. ఆత్మహత్యలకు నిలయంగా మారింది. కోనేటిలో నీరు పూర్తిగా పచ్చగా మారిపోయింది. నాచు, నీటి మొక్కలతో నిండిపోయింది. పదేళ్ల కిందట అధికారులు కోనేరును బాగు చేసేందుకు ఒక కాంట్రాక్టర్‌కు పనిని అప్పగించారు. నీరును తోడించి లోతు ఎక్కువగా ఉండటాన్ని గ్రహించాడు. దాన్ని బాగు చేయడానికి ఆధునిక యంత్ర పరికరాలు అవసరమవుతాయని నిర్ణయించుకుని చేతులెత్తేశాడు. అనంతర కాలంలో ప్రమాదాలు నివారించడానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. అయితే, నీటిలో కాలుష్యం పెరిగి చుట్టుపక్కల భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. దోమలు ఉత్పత్తి కేంద్రంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోనేరును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'సూర్యోదయం' టెలీ ఫిలిం ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: సూర్యోదయం టెలీ ఫిలిం ద్వారా విద్య పరమార్థాన్ని చాటి చెబుతున్నట్లు కథా రచయిత, నిర్మాత, దర్శకుడు గన్నె నాగ వాసుదేవరావు పేర్కొన్నారు. ఏటీ అగ్రహారం రామిరెడ్డినగర్‌లోని తన నివాసంలో గురువారం టెలీ ఫిలిం నిర్మాణం ప్రారంభమైంది. విశ్వసంకీర్తన ఆచార్య తుర్లపాటి శంభయాచార్య, జి.వెంకటేశ్వరరావు తొలి ముహూర్తపు షాటును క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ జెడ్పీ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా విద్యార్థులతో అనేక సామాజిక ప్రయోజిత కార్యక్రమాలు, పాటలు పాడటం, నటించడం నేర్పించానని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం విద్యార్థులకు నటన నేర్పించి ప్రోత్సహిస్తూ వారితో పదికి పైగా షార్ట్ ఫిలిమ్స్ నిర్మించి 'నేషన్ బిల్డర్' అవార్డు అందుకున్నట్లు చెప్పారు. కథా పరంగా సూర్యోదయం షార్ట్ ఫిలిం మహిళల విద్య ప్రాధాన్యతను గురించి తీస్తున్నట్లు తెలియజేశారు. చిత్రంలో వి.హనుమంతరావు, కె.మమత, సుకన్య, ఎన్.సత్యనారాయణాచారి, పి.హరినాథ్ బాబు, నాగవేణి తదితర 30 మంది నటీనటులు నటిస్తున్నారని తెలిపారు.

చండ్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, కార్యవర్గ సభ్యులు

లక్ష్మీపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, భూపోరాట యోధుడు, అమరజీవి చండ్ర రాజేశ్వరరావు జయంతిని గురువారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు రావుల అంజిబాబు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల శివాజీ, ఆకిటి అరుణ్ కుమార్, నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, మంగా శ్రీనివాసరావు, చల్లా మరియ దాస్, సమితి సభ్యులు నూతలపాటి చిన్న, దూపాటి రత్నం, చెవుల పున్నయ్య, ఈ. వెంకటేశ్వరరావు, పి.జగన్నాథం, రాగం నాగరాజు, యోగయ్య, రాయల వెంకటేశ్వర్లు, బాలయ్య, కూరాకుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

పచ్చదనం పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో గౌసుల్ మీరా, సిద్దిఖ్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చదనాన్ని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని జిల్లా సైన్స్ సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌసుల్ మీరా మాట్లాడుతూ ఈ అనంత విశ్వంలో జీవరాశి నివసించడానికి అత్యంత అనుకూలమైన గ్రహం భూమి అన్నారు. భూమాత పచ్చగా, చల్లగా ఉంటేనే జీవరాశి మనుగడ సాధ్యం అవుతుందని చెప్పారు. చుట్టూ ఉన్న జీవజాతులు నశిస్తే చివరికి మనిషి సైతం నశించే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రకృతి విపత్తులు పెరిగి భూగ్రహం రోజురోజుకీ నిప్పుల కొలిమిలా మారుతోందన్నారు. శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని మానవహితానికి ఉపయోగించాలే తప్ప, వినాశనానికి కాదని తెలిపారు. ప్రతి వ్యక్తీ చెట్లను నాటి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తే భూమి మరలా తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్ని నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ మన బాధ్యతని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దిఖ్, ఉపాధ్యాయులు అప్పారావు, నాగేశ్వరరావు, ధనయ్య, బాబూరావు, కలాం పాల్గొన్నారు.



జోసఫ్‌నగర్‌లోని పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న ధాత్రి కుమారి, విద్యార్థినులు

చెట్ల పెంపకంతోనే మానవ మనుగడకు రక్షణ

చెట్లు పెంచడం ద్వారానే మానవ మనుగడకు అవి రక్షణగా నిలుస్తాయని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి డాక్టర్ డి. ధాత్రి కుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం 2, 3 విభాగాల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జోసెఫ్ నగర్, కేవీపీ కాలనీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాత్రి కుమారి మాట్లాడుతూ భవిష్యత్తులో మానవ మనుగడ ఆరోగ్యంగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని ఆమె సూచించారు. ఇప్పుడు నాటిన మొక్కలు రేపటి తరాలవారికి గొడుగులా రక్షణ ఇస్తాయని తెలిపారు. సకాలంలో వర్షాలు లేక, అడవులు ఎక్కువగా కొట్టివేయడం వలన మనం ఎంతో నష్ట పోతున్నామని పేర్కొన్నారు. మంచి ఆక్సిజన్ కోసం ప్రతి ఒక్కరూ కనీసం రెండు చెట్లు నాటి సంరక్షించాలని ఆమె సూచించారు. మరొక ఎన్ఎస్ఎస్ అధికారిణి కె. సుబ్బరత్తమ్మ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అనవసరంగా చెట్లను నరికివేయడం బాధాకరమని, దాని ప్రభావం ఎంత దారుణంగా ఉంటుందో తాజాగా వేసవి కాలంలో చవి చూశామని తెలిపారు. కార్యక్రమంలో కె.ఆనంద్, పి. మేరీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



ఫిరంగిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యసిబ్బంది

ఫిరంగిపురం: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-1 , 2 పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నిర్మూలన ద్వారా వ్యాధులు దూరం అవుతాయని చెప్పారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 30 వరకు మాసోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఆరోగ్యసిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. వారానికోమారు గాబులు శుభ్రం, మురుగుకాలవల్లో పూడికతీత వంటివి చేసుకోవాలని తెలిపారు. నీరు నిలువ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల లార్వా ఉండదని చెప్పారు. అనంతరం సచివాలయం నుంచి బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ

మేడికొండూరు: వివాహేతర సంబంధం అనుమానంతో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను మేడికొండూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు గ్రామానికి చెందిన తోటా బాలకృష్ణ తన భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో షేక్ రషీద్‌పై పగ పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో మే 30న పెదపలకలూరు నుంచి కారులో తోటా బాలకృష్ణ పేరేచర్లకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. పేరేచర్ల, పలకలూరు మార్గ మధ్యలో పెట్రోలు బంకు వద్దకు ద్విచక్ర వాహనంపై షేక్ రషీద్, అతని స్నేహితుడు రసూల్ రావడాన్ని బాలకృష్ణ గమనించాడు. కారును వేగంతో నడిపి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. రషీద్, రసూల్ కిందపడ్డారు. బాలకృష్ణ కారు దిగి రషీద్‌పై హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో రషీద్ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలకృష్ణ, అతనికి సహకరించిన ఎం.కృష్ణలను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. సమావేశంలో మేడికొండూరు సీఐ జయకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ వాసు, సిబ్బంది సిద్ధయ్య, కె.రామారావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహం

తాడేపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వృద్ధుడు తర్వాత విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం బ్యారేజ్ ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న గుర్తుతెలియని వృద్ధుడిపై నుంచి ఈనెల 3వ తేదీన బొలెరో వాహనం వెళ్లడంతో రెండు కాళ్లు విరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న తర్వాత బాధితుడిని 108 ద్వారా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని, అప్పటి నుంచి అపస్మారక స్థితిలోనే ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. గురువారం మృతి చెందాడని ఆసుపత్రి వారు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేశామని, మృతుడి వయస్సు సుమారు 65-70 సంవత్సరాలు ఉంటుందని, బహుశా ఎక్కడి నుంచో వచ్చి విజయవాడ చుట్టుపక్కల హోటళ్లలో పనిచేయడం కానీ, యాచిస్తూ కానీ జీవిస్తున్నాడని అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరికైనా ఈ వృద్ధుడి వివరాలు తెలిస్తే తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సీనియర్ కళాకారులకు పురస్కారాలు, సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు జన్మ దినోత్సవం సందర్భంగా యువ కళావాహిని ఆధ్వర్యంలో గురువారం సీనియర్ కళాకారులకు నగదు పురస్కారాలు అందించారు. సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించారు. రంగస్థల నటులు వరికూటి శివప్రసాద్, జానా రామయ్య, అమ్మని విజయలక్ష్మి, గాయకుడు స్టాలిన్ బాబు, సంగీత విద్వాంసులు షేక్ సైదులు, రామ్మోహన్‌ను నగదు పురస్కారాలతో సత్కరించారు. అతిథులుగా స్టేట్ ట్యాక్స్ సహాయ కమిషనర్ ఆర్.వేణుగోపాలరావు, కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ గాదె శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, పట్టాభి కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, విద్యావేత్త, కళాపోషకులు నూతలపాటి తిరుపతయ్య, సంస్థ ప్రధాన కార్యదర్శి జి. మల్లికార్జునరావు పాల్గొన్నారు. అనంతరం కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'అమృత హస్తం' నాటిక ప్రేక్షకుల్ని అలరించింది. నాటికలో కావూరి సత్యనారాయణ, సరిత, హరిబాబు, మాధవి, గోపాల్‌రెడ్డి నటించారు.

ముగిసిన వేసవి చిత్రకళా శిబిరం



కౌసిలి శ్రద్ధ



రుత్విక్



సహస్ర

- ముగింపు రోజున చిత్రలేఖన పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ ఆర్ట్ సొసైటీ, తెనాలి స్థానిక గంగానమ్మపేటలోని ఆదర్శ్ స్కూల్ సహకారంతో స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన వేసవి చిత్రకళా శిబిరం ముగిసింది. ముగింపు రోజైన గురువారం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సీనియర్స్‌లో అన్నం కౌసిలి శ్రద్ధ, జూనియర్స్‌లో ఈదర రుత్విక్, సబ్ జూనియర్స్‌లో అన్నం సహస్ర ప్రథమ బహుమతులను సాధించినట్టు సొసైటీ నిర్వాహకుడు, ప్రముఖ చిత్రకారుడు జయశేఖర్ తెలిపారు. వీరిని స్కూల్ యాజమాన్యం, చిత్రకారుడు అభినందించారు. చిన్నారులు ఎంతో శ్రద్ధగా చిత్రాలను చిత్రించటం నేర్చుకున్నట్టు చెప్పారు. విద్యార్థులను వారికి నచ్చిన రంగులతో సాధన చేసేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు.

పండ్లు పంపిణీ

తెనాలిరూరల్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పట్టణానికి చెందిన వల్లెం మురళి ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక మహాత్మా శాంతి ఆశ్రమంలో గురువారం కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు పంచిపెట్టారు. ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, మైలా భాను ప్రకాష్ పాల్గొన్నారు.